జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## నల్లగొండ
సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
ఆదివారం 10 మే 2026 పేజీలు : 14






3 లో..

## తెలంగాణ సాయుధ పోరాట యోధుడికి ఘన నివాళి

### ఈ నెల 11 నుండి 17 వరకు

# "విద్యా వారోత్సవం" కార్యక్రమం

### జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్గొండ మే 09(ప్రజాజ్యోతి ప్రతినిధి):**

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈ నెల 11 నుండి 17 వరకు "విద్యా వారోత్సవం" నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. విద్యా వారోత్సవాన్ని ...మిగతా 2లో



2 లో..

## జనగణనపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ప్రచార రథం

### యాసంగి ధాన్యం

# కొనుగోళ్లను వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్. బి చంద్రశేఖర్




**నల్గొండ మే 09(ప్రజాజ్యోతి ప్రతినిధి):**


యాసంగి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్. బి చంద్రశేఖర్ అన్నారు. దేవరకొండ నియోజక వర్గ పరిధిలో 15 రోజుల్లో ధాన్యాన్ని కొనుగోలు పూర్తి చేయాలని చెప్పారు. శనివారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్,. దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ తో కలిసి డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు 457 కొనుగోలు కేంద్రాల ద్వారా 3.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. మొత్తం 6.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని ముందస్తు అంచనా వేసినట్లు పేర్కొన్నారు. మిగిలిపోయిన ధాన్యం ...మిగతా 2లో

3 లో..

### విద్యా వారోత్సవాలను

# విజయవంతం చేయాలి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశం





# జనగణన పై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ప్రచార రథం

## జనగణన సందర్భంగా పూర్తి సమాచారం ఇచ్చి సహకరించండి

**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**నల్గొండ మే 09(ప్రజాజ్యోతి ప్రతినిధి):**

జనగణనకు ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు సరైన సమాచారం ఇచ్చి సహకరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. జనగణన అన్ని రకాల అభివృద్ధికి ముఖ్యమని, జనగణలో ప్రతి కుటుంబం వారి వివరాలను తెలియజేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జనగణన పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఉద్దేశించి ఏర్పాటుచేసిన ప్రచార రథాన్ని శనివారం అయన నల్గొండ జిల్లా కలెక్టర్





కార్యాలయం వద్ద జండా ఊపి ప్రారంభించారు. 2027 జన గణనలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మొదటి విడత సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేపట్టడం జరిగిందని, అది ఈ నెల 10 తో ముగుస్తుందని, ఈ నెల 11 నుండి హౌస్ లిస్టింగ్, జనగణన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, జనగణనకు జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని చర్యలు చేపట్టిందని, ఈ నెల 11 నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికి వచ్చి జనాభా వివరాలు సేకరిస్తారని, ఇందుకు జిల్లాలోని ప్రజలందరూ సరైన, పూర్తి సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. జనాభా వివరాల సేకరణ కేవలం జనాభా లెక్కలకు ఉద్దేశించి మాత్రమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. జనగణనలో ఇండ్లకు సంబంధించిన వివరాలతో పాటు, కుటుంబాల వివరాలు సమర్పించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. జనగణన పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన ప్రచార రథం జిల్లాలోని 33 మండలాల పరిధిలో పర్యటించి జనగణన పై ప్రజలకు అవగాహన కల్పిస్తుందని తెలిపారు. జిల్లాలోని ప్రజలందరూ జనగణనకు సహకరించాలని పునరుద్ఘాటించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సి పి ఓ శ్రీనివాస్ నాయక్, జిల్లా అధికారులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ఈ నెల 11 నుండి 17 వరకు "విద్యా వారోత్సవం" కార్యక్రమం

**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

(మొదటి పేజీ తరువాయి)

విజయవంతం చేయాలని ఆయన కోరారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు హైదరాబాద్ నుండి విద్య వారోత్సవం, స్వీయ గణన, ఫార్మర్స్ రిజిస్ట్రీ, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ పై అంశాలపై జిల్లా అధికారులకు సూచనలు చేశారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈ నెల 11 నుండి 17 వరకు విద్యా వారోత్సవం విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యా వారోత్సవం లో భాగంగా విద్యాసంస్థల్లో పనుల శంకుస్థాపన, ఎస్ ఎస్ సి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లమెంటరీ పరీక్షలు ద్వారా ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక తరగతుల నిర్వహణ, వర్క్ షాప్ ల ఏర్పాటు, జయశంకర్ బడిబాట కార్యక్రమం, పోషకుల సమావేశాలు, విద్యా వేడుకల కార్యక్రమాలు నిర్ణీత ప్రణాళిక ప్రకారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. జనగణన ప్రక్రియకు సంబంధించి, సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలన్నారు. వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని





వెంటవెంటనే మిల్లులకు తరలింపు చేపట్టాలని వివరించారు. తగినన్ని గన్ని సంచులు, లారీలు, తగినంతమంది హమాలీలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్ నాయక్, డీఈ ఓ బిక్షపతి, డి ఐ ఈ ఓ దస్రు నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్, తదితరులు ఉన్నారు.

# యాసంగి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్. బి చంద్రశేఖర్**

(మొదటి పేజీ తరువాయి)

కొనుగోళ్లు వచ్చే 15 రోజుల్లో పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. దేవరకొండ డివిజన్ పరిధిలో స్థానిక ఎమ్మెల్యే సహకారంతో మిల్లర్ల సమన్వయం ద్వారా ధాన్యం వేగంగా మిల్లులకు తరలించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అవసరమైన చోట హమాలీల సంఖ్యను పెంచడంతో పాటు, అదనంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యం కళ్లాల్లో ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా త్వరితగతిన తరలింపు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం అమ్మిన రైతులకు చెల్లింపులు సకాలంలో జరుగుతున్నాయని, ఇప్పటివరకు రూ487 కోట్లు చెల్లించామని తెలిపారు. డివిజన్ పరిధిలోని 12 మిల్లులకు చెందిన మిల్లర్లు ధాన్యం సేకరణలో పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలని పేర్కొంటూ అదనంగా 30 లారీలను పెంచామని, ప్రస్తుతం మొత్తం 100 లారీలతో 24 గంటల వ్యవధిలో ధాన్యం అన్‌లోడింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ రైతు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొంటుందని,ఒక వేళ వర్షానికి ధాన్యం తడిచినా కొంటుందని తెలిపారు. దేవరకొండ నియోజకవర్గానికి ఈసారి సుమారు 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని, ఇప్పటివరకు 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. డిండి ప్రాంతంలో ఇంకా వరి కోతలు కొనసాగుతున్నాయని, అక్కడినుండి వచ్చే ధాన్యం కొనుగోలుకు అనుగుణంగా కలెక్టర్, జేసీ ఆధ్వర్యంలో చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.

నియోజకవర్గంలోని 12 మిల్లుల మిల్లర్లు ధాన్యం స్వీకరణలో భాగస్వామ్యం కావాలని కోరారు.ప్రస్తుతం



ఉన్న 70 లారీలు సరిపోకపోతే మరిన్ని లారీలు కూడా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఏ కేంద్రంలో ధాన్యం ఎక్కువగా ఉంటే అక్కడికి వెంటనే లారీలు పంపిస్తామని చెప్పారు. వచ్చే పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చిత్తశుద్ధితో పనిచేస్తోందని. మిల్లర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే ప్రతి గింజ కొనుగోలు చేసి రైతులను ఆదుకోవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశనికి రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ ఇంచార్జ్ ఆర్డిఓ రమణారెడ్డి, డిఎస్ఓ వెంకటేష్, డిఎం రాంపత్తి నాయక్, డిసిఓ పత్యా నాయక్ , మార్కెటింగ్ ఏడి ఛాయాదేవి, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, డిటి ముబీన్, రైస్ మిల్లర్ల తరఫున వెంకన్న, శ్రీనివాస్, అధికారులు, తదితరులు హాజరయ్యారు.



# విద్యార్థుల ప్రతిభ వికాసానికి సమ్మర్ క్యాంప్

## పోచంపల్లి పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్‌లో 15 రోజుల ప్రత్యేక శిక్షణ

**– మండల విద్యాధికారి ప్రభాకర్**

**భూదాన్ పోచంపల్లి, మే 09 (ప్రజాజ్యోతి)**

పోచంపల్లి మరియు పరిసర గ్రామాల ప్రభుత్వ పాఠశాలల 6వ నుండి 9వ తరగతి విద్యార్థుల కోసం పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్, భూదాన్ పోచంపల్లిలో ఈ నెల 11వ తేదీ నుండి 25వ తేదీ వరకు 15 రోజుల పాటు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి ప్రభాకర్ తెలిపారు. ఈ వేసవి శిబిరంలో విద్యార్థులకు యోగా, ఇండోర్ గేమ్స్, గణితం, స్పోకెన్ ఇంగ్లీష్, సైన్స్ ప్రయోగాలు, క్విజ్ పోటీలు, డ్యాన్స్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ తదితర అంశాలలో ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులలో సృజనాత్మకత, మేధస్సు, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించడమే ఈ సమ్మర్ క్యాంప్ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని తప్పనిసరిగా శిబిరానికి హాజరై ప్రయోజనం పొందాలని మండల విద్యాధికారి ప్రభాకర్ కోరారు.

# తెలంగాణ సాయుధ పోరాట యోధుడికి ఘన నివాళి

**నాగారం మే 09 ప్రజా జ్యోతి.**

నాగారం మండలం ప్రగతి నగర్ దగ్గర బిఎల్ స్మృతి వనం వద్ద తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ భీంరెడ్డి నర్సింహారెడ్డి 18వ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని భీంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదల పెన్నిధిగా, అణగారిన వర్గాల గొంతుకగా కామ్రేడ్ భీంరెడ్డి నర్సింహారెడ్డి చేసిన పోరాటాలు చిరస్మరణీయమని కొనియాడారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం ఆయన జీవితాంతం చేసిన సేవలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు కడెం లింగయ్య, ఎంఆర్పీఎస్ నల్గొండ జిల్లా అధ్యక్షులు కందుకూరి సోమన్న, తిరుమలగిరి రజక సంఘం మండల అధ్యక్షులు పులిమామిడి సోమన్న, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తన్నీరు రాంప్రభు, సీపీయూఎస్ఐ రాష్ట్ర నాయకులు మట్టిపల్లి లింగయ్య, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు జంపాల మల్లేష్, మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర నాయకులు చేను శ్రీనివాసులు, మైనార్టీ నాయకులు ఎండి రహమాన్, రజక సంఘం నాయకులు పోరెళ్ళ లక్ష్మయ్య, సోమ నరసయ్య, పులిమామిడి బిక్షం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# భూపతి రామయ్యకు నివాళులర్పించిన :జూకంటి

రాజాపేట, మే 9 (ప్రజా జ్యోతి ) ప్రజా అక్షరం దినపత్రిక ఎడిటర్ సీనియర్ జర్నలిస్టు భూపతి శ్రీనివాస్ తండ్రి భూపతి రామయ్య మరణించగా శనివారం రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నేత జూకంటి ప్రవీణ్ కుమార్ బూరుగుపల్లి గ్రామంలో భూపతి రామయ్య మృతదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిసి నేత జూకంటి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రామయ్య జీవించి ఉన్నంతకాలం నీతి, నైతికతతో విలువలతో కూడిన జీవనం గడిపారన్నారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మార్పీఎస్ నేత మొత్కుపల్లి నవీన్ కుమార్, క్రైస్తవ మత పెద్దలు, పాల్గొన్నారు.



# విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశం

**భువనగిరి మే09(ప్రజాజ్యోతి న్యూస్)**

99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి 17 వరకు నిర్వహించనున్న విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు.
శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 99 రోజుల ప్రత్యేక ప్రణాళిక విద్యా వారోత్సవాలు, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, జనగణన స్వీయ గణన విధానం, ఫార్మర్స్ రిజిస్ట్రీ తదితర అంశాలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ అగ్రి స్టాక్ -- ఫార్మర్స్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఇంకా నమోదు చేసుకోని రైతులు త్వరితగతిన తమ వివరాలను నమోదు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫార్మర్స్ రిజిస్ట్రీ ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధి నేరుగా అందించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జనగణనలో భాగంగా స్వీయ గణన విధానాన్ని అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ ఖచ్చితమైన వివరాలు నమోదు చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. వరి ధాన్యం కొనుగోళ్లపై హమాలీలు, రవాణా, బస్తాల నిల్వలు, ఓపీఎంఎస్ నమోదు, తాడిపత్రిలు వంటి అంశాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, అలాగే రైతులకు చెల్లింపులు త్వరితగతిన వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యా ప్రమాణాల మెరుగుదలకు 99 రోజుల విద్యా కార్యాచరణ



ప్రణాళికను మే 11 నుంచి ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ, జిల్లా సివిల్ సప్లై అధికారి రోజారాణి, వ్యవసాయ అధికారి రమణారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

## 2600 పైచిలుకు దరఖాస్తులు.. 1800 మందికి స్క్రీనింగ్ పూర్తి

**భువనగిరి మే09(ప్రజాజ్యోతి న్యూస్)**

పట్టణంలోని న్యూ డైమెన్షన్ స్కూల్ లో కుంభం ఫౌండేషన్ చైర్మెన్ కుంభం కీర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా కార్యక్రమానికి నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన లభిస్తోంది. భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ జాబ్ మేళాకు ఇప్పటివరకు 2600 పైచిలుకు మంది అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దరఖాస్తు చేసిన వారిలో ఇప్పటికే 1800 మందికి స్క్రీనింగ్ నిర్వహించి టోకెన్ కేటాయింపు పూర్తి చేసినట్లు వెల్లడించారు. వివిధ ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని తెలిపారు. ఇంటర్వ్యూల అనంతరం ఎంపికైన అభ్యర్థులకు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్వయంగా నియామక పత్రాలు అందజేయనున్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కుంభం ఫౌండేషన్ ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు.






# యూట్యూబ్ చూసి...! ఏటీయం చోరికి యత్నించిన నిందితుల అరెస్ట్

**మిర్యాలగూడ, మే 09,( ప్రజాజ్యోతి ):**

సెక్యూరిటీ గార్డులు గా పనిచేస్తున్న ఇద్దరు.. ఈజీగా మనీ సంపాదించేందుకు దొంగలుగా మారారు... ఏకంగా ఏటీఎంనే దోచేద్దామనుకున్నారు... పెగ్... ప్రయత్నించి విఫలమై పారిపోయారు.. చిన్న క్లూ తో ఆచూకీ కనిపెట్టి అరెస్టు చేశారు వాడపల్లి పోలీసులు. శుక్రవారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిఐ పి. నాగ దుర్గాప్రసాద్ కేసు వివరాలను వెల్లడించారు. సూర్యాపేట జిల్లా, నేరేడుచర్ల మండలం, రామాపురం గ్రామానికి చెందిన మోతుకూరి రమణాచారి, ఏపీకి చెందిన వేరే మోహన కుమార్ రెడ్డి లు హైదరాబాదులోని ట్యాంక్ బాండ్ సమీపంలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తూ స్నేహితులయ్యారు. జీతం సరిపోవట్లేదని ఈజీగా మనీ సంపాదించేందుకు ఉద్యోగాలు వదిలేశారు. రమణాచారి స్నేహితుడు దామరచర్ల మండలంలోని లావురి తండాకు చెందిన రమేష్ వద్దకు ఏప్రిల్ 23న,వచ్చి స్థానికంగా నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (వైటిపిఎస్) లో సెక్యూరిటీ గార్డులుగా పని ఇప్పించాలని కోరారు. ఆరోజు సంబంధిత అధికారి లేకపోవడంతో దామరచర్ల మండల కేంద్రంలో ఓ వైన్స్ లో మద్యం సేవిస్తూ స్థానికంగా ఉన్న ఏటీఎం వద్ద ఎలాంటి రక్షణ లేకపోవటాన్ని గమనించారు. ఎలాగైనా ఏటీఎంను కొల్లగొడితే పెద్ద ఎత్తున డబ్బు వస్తుందని ఆశతో



యూట్యూబ్లో చోరీ ఎలా చేయాలనేది చూసి, అర్ధరాత్రి దాటిన తర్వాత ఏటీఎంలో చొరబడి, ఇనుప రాడ్డుతో ఏటీఎం తెరిచే ప్రయత్నం చేయగా అలారం మోగటంతో పారిపోయారు. తమ పైన ఎలాంటి అనుమానం రాకుండా మహబూబ్ నగర్ లో సెక్యూరిటీ గార్డులుగా చేరారు. చోరీ ప్రయత్నాన్ని చాలెంజిగా గా తీసుకున్న ఎస్ ఐ శ్రీకాంత్ రెడ్డి,ఏఎస్ఐ కోడిరెక్క జోజి లు నిందితులను గుర్తించారు. శుక్రవారం ఇంటి సామాగ్రిని తీసుకు వెళ్లేందుకు వచ్చినా నిందితులను అరెస్టు చేసి, రిమాండ్ కు తరలించినట్టు తెలిపారు. కేసును చాకచక్యంగా చేదించిన వాడపల్లి పోలీసులను ప్రత్యేకంగా అభినందించారు.

# మిర్యాలగూడలో ట్రాఫిక్ రద్దీ తగ్గించి... సురక్షిత ప్రయాణం అందించటమే ధ్యేయం...!

## శాశ్వత పరిష్కారం చూపే దిశగా కృషి - ఎమ్మెల్యే బిఎల్ఆర్

**మిర్యాలగూడ, మే09,( ప్రజాజ్యోతి):**

మిర్యాలగూడ పట్టణ ప్రజల దశాబ్దాల ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) ముమ్మర ప్రయత్నాలు చేయడంలో భాగంగా శనివారం రాత్రి సాగర్ రోడ్డుపై నూతనంగా నిర్మిస్తున్న డివైడర్ల పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక ఒన్ టౌన్, టూ టౌన్ ఇన్స్పెక్టర్ లు ఎం. నాగభూషణరావు, జె. సోమనర్సయ్య, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ పోలీసు అధికారులతో కలిసి ఆయన రహదారి పరిస్థితులను పర్యవేక్షించారు. గత నాలుగు రోజులుగా మారుతున్న ట్రాఫిక్ గమనాలు, కొత్త డివైడర్ల వల్ల కలుగుతున్న మార్పులను అధికారులతో కలిసి విశ్లేషించారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అదనపు సిబ్బంది అవసరమని గుర్తించిన ఎమ్మెల్యే వెంటనే జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ తో ఫోన్లో మాట్లాడారు మిర్యాలగూడకు అవసరమైన అదనపు పోలీస్ సిబ్బందిని వెంటనే కేటాయించాలని ఆయన కోరారు. కేవలం జరిమానాలు విధించడం కాకుండా, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కొత్తగా మారుతున్న నిబంధనల వల్ల వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. నో-పార్కింగ్ జోన్లలో వాహనాలు నిలపకుండా చూడాలని,వాహనదారులకు ఇబ్బందికలగకుండా వ్యాపారస్తులు నిర్దేశిత పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు యంత్రాంగం ప్రజలతోస్నేహపూర్వకంగా ఉంటూనే, ట్రాఫిక్ నిబంధనలను అమలు చేయాలన్నారు. పర్యవేక్షణ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణ అభివృద్ధి, ప్రజల క్షేమమే మొదటి ప్రాధాన్యత ట్రాఫిక్ రద్దీని తగ్గించి, సురక్షిత ప్రయాణాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలు కూడా నిబంధనలను పాటించి అధికారులకు సహకరించాలని కోరారు. నేషనల్ హైవే నిబంధనలు,?పట్టణ మాస్టర్ ప్లాన్లో భాగంగా చేపడుతున్న చర్యలు భవిష్యత్తులోమిర్యాలగూడ రూపురేఖలను మారుస్తాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు .





# దళారుల వద్దు కొంటూ, ఐకెపి ధాన్యం ఆలస్యంగా దిగుమతి....

## రైస్ మిల్లర్ల తీరుపై బిజెపి ఆగ్రహం ఆందోళన....

**రాజాపేట మే 9 (ప్రజా జ్యోతి )**

దళార్ల ధాన్యం కొంటూ ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి లారీల ద్వారా వచ్చిన ధాన్యశీ బస్తాలను దిగుమతి చేసుకోకుండా మూడు రోజులపాటు ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైస్ మిల్ యజమానుల తీరును విమర్శిస్తూ బిజెపి ఆధ్వర్యంలో శనివారం రాజాపేటలో ఆందోళన చేపట్టారు.



రాజాపేట లోని మణికంఠ పారాబైల్డ్ రైస్ మిల్ వద్ద బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు రైస్ మిల్ ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేసి నినాదాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న తహసిల్దార్ వల్లపు ప్రదీప్ ఆందోళన కారణకు నచ్చజెప్పి సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. రైస్ మిల్ యాజమాన్యం తీరు మారకపోతే మిల్ కు తాళం వేసి నిరాహార దీక్ష చేపట్టి రైతులకు న్యాయం చేస్తామని రాజపేట మండల బిజెపి పార్టీ అధ్యక్షులు మేకల రమేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దాచేపల్లి రాజు, మెండు భగవాన్ రెడ్డి, దాచేపల్లి శ్రీనివాస్, గాండ్ల నర్సింగరావు, కుమ్మరి లక్ష్మణ్, బూరుగు శేఖర్ రెడ్డి, సాధనబోయిన శంకర్, చిగుళ్ల బీరయ్యు, మార్కశివ,, గవ్వల అనిల్ కుమార్, ఐరేణి శ్రీధర్, కుంట కరుణాకర్ రెడ్డి, సంగేమ్ తదితరులున్నారు.

# తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి

**ఆలేరు, మే 09 (ప్రజా జ్యోతి):**

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలంలోని వర్టూరు గ్రమంలో తాటి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడిన గీత కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఐతగాని సిద్దయ్య(60) వృత్తిలో భాగంగా శనివారం ఉదయం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడిపోయాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు సిద్దయ్యను చికిత్స నిమిత్తం హైదరాబాద్లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు.



# వేదికపై 97 ఏళ్ల మాఖన్ లాల్ కాళ్లు మొక్కిన ప్రధాని మోదీ..

**కోల్‌కతా:**

పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పశ్చిమ బెంగాల్ కొత్త ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో వేదికపై 97 ఏళ్ల వృద్ధుడు మాఖన్ లాల్ సర్కార్ పాదాలకు మోదీ నమస్కరించడం చర్చనీయాంశంగా మారింది. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వేదికపై మాఖన్ లాల్ సర్కార్‌ను సన్మానించి, కౌగలించుకున్న ప్రధాని, అనంతరం ఆయన కాళ్లకు నమస్కరించారు. బెంగాల్‌లోని సిలిగురికి చెందిన మాఖన్ లాల్ సర్కార్ బీజేపీ సీనియర్ నాయకుడు. ఆయన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడైన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి సన్నిహితుడిగా మెలిగారు. ఆయనకు సహాయకుడిగా పని చేశారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మరణానంతరం జరిగిన అంతిమ యాత్రలో కూడా మాఖన్ లాల్ పాల్గొన్నారని బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య తెలిపారు. అలాగే, కాంగ్రెస్ పాలన సమయంలో దేశభక్తి గీతం పాడినందుకు ఢిల్లీ పోలీసులు మాఖన్ లాల్ సర్కార్‌ను అరెస్టు చేసిన సంఘటనను కూడా బీజేపీ నేతలు గుర్తు చేసుకు న్నారు. కోర్టులో క్షమాపణ చెప్పడానికి కూడా మాఖన్ లాల్ నిరాకరించారట. కోర్టులో కూడా అదే పాటను మళ్లీ పాడారట. దీంతో న్యాయమూర్తి.. మాఖన్ లాల్ తిరుగు ప్రయాణ ఖర్చులకు అవసరమైన వంద రూపాయలు ఇవ్వాలని ఆదేశించారట. బెంగాల్‌లో తొలిసారి బీజేపీ అధికారంలోకి రావడంతో ఆ సీనియర్ నాయకుడికి బీజేపీ నేతలు తగిన గౌరవం కల్పించారు.

# తెలంగాణ నేరాలకు అడ్డాగా మారింది: సబితా

**హైదరాబాద్:**

తెలంగాణలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని బిఆర్ఎస్ మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. మాజీ సిఎం కెసిఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో ప్రగతి సాధించి ందని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్ లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. బిఆర్ ఎస్ హయాంలో తెలంగాణ పోలీసులు దేశంలోనే నంబర్ వన్ అని కొనియాడారు. కానీ ఇప్పుడు తెలంగాణ పోలీసులు దేశంలోనే వెనుకంజలో ఉన్నారని విమర్శించారు. శాంతి భద్రతలను విస్మరిస్తే రాష్ట్రం అధోగతేనని, ప్రతిపక్షంలో ఉన్న వారికి రాజకీయ వేధింపులు ఉన్నాయని మండిపడ్డారు. లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని, ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రే హోం మంత్రి అని సబితా పేర్కొన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ఏం సమీక్షలు చేస్తున్నారు? అని ప్రశ్నించారు. హోం శాఖ తప్ప అన్ని సమీక్షలు జరుగుతున్నాయని, హోంశాఖకు సంబంధించి కెసిఆర్ సంస్కరణలు తెచ్చారని తెలియజేశారు. హైదరాబాద్ లో 12 లక్షల సిసి కెమెరాలు ఉన్నాయని చెప్పారు. అవన్నీ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచే మానిటరింగ్ చేయొచ్చనని, కానీ ఇవాళ ఎలాంటి మానిటరింగ్ జరగడం లేదని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత పట్టపగలే హత్యలు జరుగుతున్నాయని, శుక్రవారం మాజీ ఐఫిఎస్ అధికారి భార్య హత్య జరగడం బాధాకరం అని అన్నారు. అదే స్థానంలో ఒక సాధారణ మహిళ ఉండి ఉంటే ఏం జరిగేది? అని ప్రశ్నించారు. ఎన్ సిఆర్ బి రిపోర్టు ఆందోళన కలిగిస్తోందని, తెలంగాణ నేరాలకు అడ్డాగా మారిందని నివేదిక తేల్చి చెప్పిందని అన్నారు. దేశమంతా క్రైం తగ్గుముఖం పడితే తెలంగాణలో పెరిగిందని, తెలంగాణలో 18.07 శాతం నేరాలు పెరిగాయని, కుప్పకూలిన శాంతి భద్రతలకు ఇది నిదర్శనం అని సబితా ఇంద్రా రెడ్డి ఎద్దేవా చేశారు.

# కొండమల్లేపల్లి పశువుల సంత లీజులో భారీ మోసం బట్టబయలు

## నకిలీ ట్రెజరీ చలాన్లతో రూ.50 లక్షలు మాయం చేసినట్లు ఆరోపణలు

## అధికారుల జోక్యంతో వెలుగులోకి వచ్చిన అక్రమాలు

## దూదిమెట్ల శ్రీనివాస్‌పై కేసు నమోదు దర్యాప్తు ప్రారంభం



**మల్లెపల్లి, మే9,(ప్రజా జ్యోతి):**

కొండమల్లేపల్లి గ్రామపంచాయతీలో 2025-26 సంవత్సరానికి సంబంధించిన పశువుల సంత లీజు వ్యవహారంలో భారీ ఆర్థిక అక్రమాలు జరిగినట్లు సంచలన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. గ్రామపంచాయతీకి కోట్ల రూపాయల ఆదాయం వచ్చే ఈ పశువుల సంతను దూదిమెట్ల శ్రీనివాస్‌కు రూ.1,22,55,000లకు లీజుకు అప్పగించారు. అయితే లీజు చెల్లింపుల పేరుతో సమర్పించిన ట్రెజరీ చలాన్లలో భారీ మోసం జరిగినట్లు అధికారులు గుర్తించారు. సమాచారం ప్రకారం, రూ.50 లక్షల చెల్లింపులకు సంబంధించిన 5 ట్రెజరీ చలాన్లను నకిలీగా సృష్టించి గ్రామపంచాయతీకి సమర్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కానీ సంబంధిత మొత్తం గ్రామపంచాయతీ అధికారిక ఖాతాలో జమ కాలేదని అధికారులు తనిఖీల్లో గుర్తించినట్లు తెలిసింది. ఈ వ్యవహారం బయటపడటంతో గ్రామంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రారంభంలో చలాన్లు నిజమైనవేనని భావించిన అధికారులు, ఇటీవల ఖాతాల పరిశీలనలో నగదు జమ కాకపోవడం గమనించి లోతుగా విచారణ చేపట్టినట్లు సమాచారం. అధికారుల ప్రత్యేక దృష్టి, రికార్డుల పరిశీలన, ఖాతాల సరిపోల్చడం వంటి చర్యల వల్లే ఈ భారీ మోసం బయటపడినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ ఎంపీఓ శ్రీ సుధీర్ కుమార్ 09-05-2026న అధికారికంగా ఫిర్యాదు సమర్పించారు. ఫిర్యాదులో దూదిమెట్ల శ్రీనివాస్ నకిలీ ట్రెజరీ చలాన్ల ద్వారా గ్రామపంచాయతీని మోసం చేశారని, ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం కలిగించారని పేర్కొంటూ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు . ఈ వ్యవహారంలో మరికొందరి పాత్ర ఉందా..? అధికారుల నిర్లక్ష్యం లేదా సహకారం ఏమైనా ఉందా..? అనే కోణాల్లో కూడా విచారణ జరగనున్నట్లు తెలుస్తోంది. గ్రామపంచాయతీ ఆదాయానికి సంబంధించిన ఇంత పెద్ద మొత్తంలో అక్రమాలు జరగడం స్థానిక ప్రజల్లో ఆగ్రహం రేకెత్తిస్తోంది. ప్రజా ధనాన్ని దోచుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# కేంద్రమంత్రి కుమారుడిపై హనీట్రాప్ అస్త్రం

హైదరాబాద్: కేంద్రమంత్రి కుమారుడిని లక్ష్యంగా చేసుకొని జరిగిన హనీట్రాప్, ఎక్స్టార్షన్ (వసూళ్ల) ప్రయత్నం ఇప్పుడు సంచలనంగా మారింది. ఈ వ్యవహారానికి సంబంధించిన ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి. "కోర్టు" సినిమా కథను ఆదర్శంగా తీసుకొని లేని "పోక్సో" కేసు ఆపాదించి కేంద్ర మంత్రి కొడుకును బ్లాక్ మెయిల్ చేసే కుట్ర బయట పడింది. ఒక మహిళ తన కూతురిని అడ్డుపెట్టుకొని కేంద్రమంత్రి కుమారుడిని హనీట్రాప్‌లోకి దించే ప్రయత్నం చేసింది. పక్కా పథకం ప్రకారం వ్యవహరించిన సదరు మహిళ, ఆ తర్వాత భారీగా డబ్బులు డిమాండ్ చేస్తూ బ్లాక్‌మెయిల్‌కు దిగింది. ఈ వేధింపులు, బెదిరింపులు ఎక్కువ కావడంతో కేంద్ర మంత్రి కుమారుడు సదరు మహిళపై కరీంనగర్‌లో ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రెండు నుండి మూడు కోట్ల రూపాయలు వసూలు చేయాలని, తనను లొంగదీసుకోవాలని చూస్తున్నారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మైనర్ అమ్మాయిని వేధించారని "పోక్సో" కేసు పెడతా అంటూ మీడియా ద్వారా రచ్చ చేస్తూ భయాందోళనకు గురిచేసే ప్రయత్నం చేస్తోంది. డబ్బులు ఆశించిన మేరకు రాకపోవడంతో, సదరు మహిళ మీడియాను ఆశ్రయించి ఈ వ్యవహారాన్ని వివాదాస్పదం చేస్తోంది. కేవలం రాజకీయంగా, ఆర్థికంగా ప్రయోజనం పొందేందుకే ఈ హనీట్రాప్ డ్రామా ఆడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం పోలీసుల దర్యాప్తులో ఉంది. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు ఈ "చలాకీ" మహిళా కార్యకలాపాలతో పాటు గతంలో ఆమె ఎలాంటి నేరాలకు పాల్పడింది అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.